కలగా మిగిలిన క్రీడా ప్రాంగణం

- ఆట స్థలాలు లేక క్రీడాకారుల అవస్థలు
- దశాబ్దాలు గడుస్తున్నా కార్యరూపం దాల్చని ప్రతిపాదన

గాజువాకలో క్రీడా ప్రాంగణం ఏర్పాటు కలగానే మిగిలిపోయింది. ప్రతిపాదనలు రూపొందించి దశాబ్దాలు గడుస్తున్నా కార్యరూపం దాల్చకపోవడంతో క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. విశాఖ మహానగరంలో అతిపెద్ద జోన్‌గా ఉన్న గాజువాకలో ఈ దుస్థితి క్రీడాభిమానులను, క్రీడాకారులను ఆవేదనకు గురి చేస్తోంది.


క్రీడా మైదానంలో అసౌకర్యాల మధ్య సాధన చేస్తున్న క్రీడాకారులు

గాజువాక: దినదినాభివృద్ధి చెందుతున్న గాజువాకలో సరైన క్రీడా ప్రాంగణం లేక క్రీడాకారులు ఇబ్బంది పడుతున్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులున్న ఈ ప్రాంతానికి ఈ లోటు తీరని వేదన మిగుల్చుతోంది. దీంతో ఔత్సాహిక క్రీడాకారులు రోడ్లపైనే సాధన చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

3 దశాబ్దాలుగా నిరీక్షణే..

గాజువాక మున్సిపాలిటీగా ఉన్నప్పుడు వినాయక నగర్ వుడా కాలనీలోని మూడున్నరెకరాల స్థలంలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి 1991లో తొలిసారిగా భూమిపూజ చేశారు. అనంతరం నిధులు లేవని వుడా చేతులెత్తేయడంతో ఆ పనులు శిలాఫలకంతోనే ఆగిపోయాయి. మళ్లీ దశాబ్దంన్నర తరువాత ఇందిరా ప్రియదర్శిని స్పోర్ట్స్ కాంప్లెక్స్ (క్రీడా సముదాయం) పేరిట 2005 నవంబర్‌లో మరోసారి అదే మైదానంలో శంకుస్థాపన చేశారు. ఆ తరువాత జిల్లా మంత్రులు కూడా దీన్ని పరిశీలించి ఏదైనా పరిశ్రమ సహాయంతో దీని నిర్మాణం చేపట్టాలని భావించారు. ఈ నేపథ్యంలో దీనికి అవసరమైన రూ.4.50 కోట్ల నిధులను సామాజిక బాధ్యత నిధుల నుంచి హెచ్‌పీసీఎల్ మంజూరు చేసింది. దీనిపై అధికారుల నుంచి సరైన స్పందన లేకపోవడంతో ఆ నిధులు కూడా పక్కకు పోయాయి. మళ్లీ దీని కథ మొదటికే వచ్చింది. వికాస్‌నగర్‌లో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసినప్పటికీ అనుకున్నంత స్థాయిలో క్రీడాకారులకు అందుబాటులోకి రాలేదనే విమర్శలున్నాయి. దీంతో పిల్లలు ఆడాలంటే రోడ్డే ఆట స్థలంగా మార్చుకోవాల్సి వస్తోంది. లేదంటే సౌకర్యాలు లేకుండా పిచ్చిమొక్కలతో ఉన్న మైదానాలను ఆశ్రయిస్తున్నారు. క్రీడా శిక్షణకు ఉపయోగపడే ఒక్క క్రీడా ప్రాంగణం అందుబాటులో లేకపోవడం లోటుగా మిగిలింది.

ప్రైవేటు వేదికలను ఆశ్రయిస్తున్నాం



గాజువాకలో సరైన క్రీడా ప్రాంగణం లేకపోవడంతో క్రీడా పోటీల నిర్వహణకు ప్రైవేటు వసతులను ఆశ్రయించాల్సి వస్తోంది. ఇదీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారంగా మారిపోయింది. ఇక్కడ ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చేసిన ప్రతిపాదనలపై ఎవరూ స్పందించకపోవడం బాధాకరమైన విషయం.

– ఎస్.రాజారావు, బాక్సింగ్ కోచ్

ఇండోర్ స్టేడియం నిర్మించాలి



ఇండోర్ స్టేడియం నిర్మిస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది. ప్రస్తుతం ఓపెన్ గ్రౌండ్‌లోనే అందరూ ప్రాక్టీసు చేస్తున్నారు. ఏవైనా పోటీలు నిర్వహించేటప్పుడు మాత్రం వికాస్‌నగర్ ఇండోర్ స్టేడియంను ఉపయోగించుకొంటున్నాం. అందులో డేట్స్ దొరక్కపోతే ప్రైవేటు వేదికలను గాని, పార్కులను గాని చూసుకోవాల్సి వస్తోంది.

– కె.సుమన్, జాతీయ కరాటే కోచ్, రిఫరీ

చాలా ఉపయోగకరం



స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను నిర్మిస్తే క్రీడాకారులకు చాలా ఉపయోగకరంగా ఉంటుంది. క్రీడలపట్ల మరింతమంది ఆసక్తి చూపించి నేర్చుకోవడానికి వస్తారు. గాజువాకలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ నిర్మాణానికి గతంలో శంకుస్థాపన చేసినప్పుడు చాలా సంతోషించాం. దాన్ని పూర్తి చేస్తే అందరికీ ఉపయోగకరం.

– తాజుద్దీన్‌బాబు, కోచ్

శాకంబరిగా దుర్గాదేవి


శాకంబరి అలంకరణలో దుర్గాదేవి


అగనంపూడి దుర్గాదేవి ఆలయంలో..

పెదగంట్యాడ: ఆషాడమాసం సందర్భంగా జీవీఎంసీ 74వ వార్డు సిద్ధేశ్వరం కొండపై కొలువుదీరిన దుర్గాదేవి శుక్రవారం శాకంబరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఈ మేరకు అమ్మవారికి ఆలయ అర్చకుడు మహేష్ శర్మ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. వారు మాట్లాడుతూ సకాలంలో వర్షాలు కురిసి, పంటలు పండుతాయనే నమ్మికతో అమ్మవారిని శాకంబరిగా అలంకరించి, పూజిస్తారని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

అగనంపూడిలో..

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాదేవి అమ్మవారిని శాకంబరిగా అలంకరించారు. కూరగాయలు, ఆకుకూరలతో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. బొర్రమాంబ ఆలయ కమిటీ భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేసింది.

విద్యార్థులకు నేత్ర వైద్య పరీక్షలు


విద్యార్థినికి కంటి పరీక్ష చేస్తున్న వైద్యసిబ్బంది

అగనంపూడి: విద్యార్థులు కళ్లను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కంటి చూపు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని అగనంపూడి హైస్కూల్ విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు బొండా అప్పారావు మాస్టారు అన్నారు. 79వ వార్డు శాంతి టాలెంట్ పాఠశాలలో అగనంపూడికి చెందిన విజన్ కేర్ నేత్ర వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే కంటి చూపు ప్రాధాన్యాన్ని గుర్తించాలన్నారు. ఈ సందర్భంగా మూడు వందల మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి కళ్లద్దాలు అందిస్తామని పాఠశాల కరస్పాండెంట్ బొండా శ్రీధర్, విజన్ కేర్ నేత్రవైద్యశాల ఆప్తమాలజిస్ట్ కె.శివకుమార్ చెప్పారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల ప్రతినిధులు కె.హనుమంతురావు, బి.సత్యనారాయణ, డాక్టర్ కె.జె.నాయుడు, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

‘సహారా ఇండియా ఖాతాదారులను ఆదుకోవాలి’

అగనంపూడి: సహారా ఇండియా ఖాతాదారులతో పాటు సంస్థ సిబ్బందిని ఆదుకోవాలని బాధితుల సంఘం, ఉద్యోగుల ప్రతినిధులు విశాఖ ఎంపీ శ్రీభరత్‌ను కోరారు. ఈ మేరకు ఆయన్ను కలిసి వినతిపత్రం సమర్పించారు. రాష్ట్రంలో 12 లక్షల మంది ఏజెంట్లు, పది కోట్ల మంది ఖాతాదారులు ఉన్నారని తెలిపారు. కాలపరిమితి దాటిన డిపాజిటర్లకు వెంటనే చెల్లింపులు చేసేలా చొరవ తీసుకోవాలని కోరారు. ఎంపీని కలిసిన వారిలో ప్రతినిధులు రామ నరసింగరావు, వై.దేముడు, బలిరెడ్డి సత్యనారాయణ, కె.పరమేశ్వరరావు వాసు తదితరులున్నారు.

క్లుప్తంగా

కమ్యూనిటీ హాల్ ప్రారంభం


ఎన్టీపీసీ నిధులతో నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను ప్రారంభిస్తున్న పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల

పెదగంట్యాడ: గ్రామాల అభివృద్ధిలో ఎన్టీపీసీ భాగస్వామి కావడం అభినందనీయమని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు చిన్నపాలెం గ్రామంలో రూ.12లక్షల 60 వేలు ఎన్టీపీసీ సీఎస్సార్ నిధులతో కొత్తగా నిర్మించిన కమ్యూనిటీ హాల్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎన్టీపీసీ వంటి సంస్థలు గ్రామాల అభివృద్ధికి పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, ఎన్టీపీసీ జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ నేహా, కాకి అప్పలరెడ్డి (బాబు) తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు


సర్టిఫికెట్లతో ఐటీఐ విద్యార్థులు

పెదగంట్యాడ: ప్రభుత్వ న్యూ ఐటీఐ, హుందాయ్ ఇండియా లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో ఐటీఐలో గ్రాడ్యుయేషన్ డే వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మోటార్ మెకానిక్‌లో శిక్షణ పూర్తి చేసుకున్న 18 మంది విద్యార్థులకు హుందాయ్ ఇండియా లిమిటెడ్ టీపీఎస్ఎం జూనీ అక్రమ్, ట్రైనింగ్ రీజినల్ మేనేజర్ ప్రతాప్, ఐటీఐ ఐఎంసీ చైర్మన్ బాలాజీ చేతుల మీదుగా సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. అలాగే 15 మంది విద్యార్థులకు లక్ష్మీ హుందాయ్ జనరల్ మేనేజర్ ఎండీ ప్రసాద్, బి.బాలరాజు ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. మిగిలిన ముగ్గురు విద్యార్థులకు మ్యాంగో హుందాయ్ అసిస్టెంట్ సేల్స్ మేనేజర్ బి.రవికుమార్, కె.ప్రవీణ్‌కుమార్ సర్వీసింగ్ సెంటర్ వద్ద నియామక పత్రాలు అందజేశారు. ఐటీఐ ప్రిన్సిపాల్ కె.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్టీల్ కార్మికులకు తక్షణం వేతనం చెల్లించాలి

ఉక్కునగరం: స్టీల్ కార్మికులకు తక్షణం వేతనాలు చెల్లించాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని నెలలుగా స్టీల్ కార్మికులకు వేతనాలు చెల్లించడంలో యాజమాన్యం దుర్మార్గమైన వైఖరి అవలంబిస్తోందన్నారు. జీతాల చెల్లింపులో యాజమాన్యం కావాలనే జాప్యం చేస్తోందన్నారు. యాజమాన్యం వైఖరిని ఉక్కు మంత్రి ఎదుట అన్ని కార్మిక సంఘాలు తీవ్రంగా తప్పుపడితే సగం జీతం చెల్లించిందని గుర్తు చేశారు. వెంటనే సగం జీతాన్ని చెల్లించకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో వై.టి. దాస్, పి. శ్రీనివాసరాజు, బి. అప్పారావు, గంగాధర్, టి.వి.కె.రాజు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడికి వినతి


హుస్సేన్‌కు బొకే అందజేస్తున్న నాయకులు

ఉక్కునగరం: జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జటోతు హుస్సేన్‌ను స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల అసోసియేషన్ సభ్యులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. విశాఖ విచ్చేసిన ఆయన్ను కలిసి.. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యలను తెలియజేసి, పరిష్కారానికి సహకరించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ స్టీల్‌ప్లాంట్ సందర్శించి, అక్కడ సమస్యలపై ఉక్కు యాజమాన్యంతో చర్చిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు బి.తాతన్న, ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య, ఎస్.సత్యనారాయణ, కె.వి.రత్నం తదితరులు పాల్గొన్నారు.

వదలని వాన

- జలమయమైన రహదారులు
- పొంగిపొర్లుతున్న గెడ్డలు
- ముంపులో లోతట్టు ప్రాంతాలు


స్వతంత్రనగర్‌లో నిలిచిపోయిన వర్షం నీరు


గాజువాక పోలీస్ స్టేషన్ సెల్లార్‌లో వర్షం నీరు


చెరువును తలపిస్తున్న ఉక్కు కళావేదిక వద్ద గల ఆట స్థలం


శ్రీనగర్ స్పెన్సర్స్ సమీపంలో జాతీయ రహదారి దిగువన కూలిన చెట్టు


వర్షం నీటితో పొంగి ప్రవహిస్తున్న అప్పికొండ గెడ్డ

గాజువాక : వాన వదలడం లేదు. వాయుగుండం ప్రభావంతో గాజువాకలో తెరిపి లేకుండా వర్షం కురిసింది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షంతో లోతట్టు ప్రాంతాల్లో నీరు నిలిచిపోయింది. తొలిరోజు గురువారం ఓ మోస్తరుగా వర్షం కురిసినా, రెండో రోజైన శుక్రవారం తెరిపివ్వకుండా వర్షం కురిసింది. కుండపోతగా కురిసిన వర్షంతో పలుచోట్ల రోడ్లు చెరువులుగా మారాయి. కాలువలు, రోడ్లు ఏకమై నీరు ప్రవహించాయి. దీంతో స్థానికులు అవస్థలు పడ్డారు. గాజువాక పోలీస్ స్టేషన్ సెల్లార్ వర్షం నీటితో నిండిపోయింది. గాజువాక కణితి రోడ్డు, మెయిన్ రోడ్డు, శ్రీనగర్‌వద్ద జాతీయ రహదారి నీట మునిగాయి. దీంతో వాహనదారులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు. రోడ్లు చిత్తడిగా మారాయి. వర్షం నీటిని తొలగించడానికి జీవీఎంసీ గాజువాక జోనల్ అధికారులు చర్యలను చేపట్టారు. జోనల్ కమిషనర్ సన్యాసినాయుడు, సహాయ ప్రజారోగ్యాధికారి డాక్టర్ కిరణ్ కుమార్ సంబంధిత సిబ్బందిని అప్రమత్తం చేశారు. వర్షం నీరు నిలిచిపోకుండా ఎక్కడికక్కడ అవసరమైన చర్యలను చేపట్టారు.

రోడ్లు, డ్రైనేజీలు ఏకమై..

అక్కిరెడ్డిపాలెం: 72వ వార్డు తోకాడలోని కాలనీలన్నీ వర్షం నీటితో ముంపునకు గురయ్యాయి. డ్రైనేజీల్లో పూడికలు పేరుకుపోవడంతో వర్షం నీరు బయటకు పోయే మార్గం లేక వర్షంనీటితో పాటు మురుగునీరు పూర్తిగా రోడ్డుపైనే నిలిచిపోయింది. రోడ్లు, డ్రైనేజీలు ఏకమై ప్రవహించడంతో స్థానికులు ఇంటి నుంచి బయటకు అడుగు పెట్టలేని పరిస్థితులు నెలకొన్నాయి.

నీట మునిగిన రహదారులు

పెదగంట్యాడ: ఏకధాటిగా కురుస్తున్న వర్షానికి మండలంలోని నడుపూరు, రామచంద్రనగర్, గాంధీనగర్, స్వతంత్రనగర్, బర్మా కాలనీ, హౌసింగ్ బోర్డు కాలనీ అప్పికొండ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయింది. వాహనచోదకులు, పాదచారులు రాకపోకలు సాగించేందుకు అవస్థలు పడ్డారు. రెండు రోజుల నుంచి ఇదే పరిస్థితి నెలకొని ఉండడంతో చిరు వ్యాపారులు ఇబ్బంది పడ్డారు.

అగనంపూడి: వర్షాలు పారిశ్రామిక ప్రాంతీయులకు ఊరటనిస్తున్నాయి. అగనంపూడి, దువ్వాడ, లంకెలపాలెం, వడ్లపూడి, కూర్మన్నపాలెం ప్రాంతాల ప్రజలు వర్షాలకు భూగర్భ జలాలు చేరతాయనే ఆనందంలో ఉన్నారు.


తోకాడలో రోడ్లు, డ్రైనేజీలు ఏకమై ప్రవహిస్తున్న మురుగు


బాలచెరువు వంతెన పక్కన ఉన్న గెడ్డ నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న ఏఎంవోహెచ్ కిరణ్ కుమార్


పెదగంట్యాడ రైతు బజార్‌లో నిలిచిన నీరు


నీట మునిగిన వుడా కాలనీ ప్రధాన రహదారి


దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లే రహదారిలో..

ఆదాయ పన్నుపై అవగాహన


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఐటీ అధికారులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్‌లో శుక్రవారం ఆదాయ పన్నుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఉక్కు పరిపాలన భవనంలోని ప్రధాన కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన కార్యక్రమంలో పన్ను వర్తింపు, సడలింపునకు సంబంధించి ఆదాయ పన్ను శాఖలో ఇటీవల జరిగిన విశేషమైన మార్పులు, పరిణామాల గురించి ఐటీ డిప్యూటీ కమిషనర్ ఐ.మధుసూదనరావు, అసిస్టెంట్ కమిషనర్ పి.వి. శేషగిరిరావు వివరించారు. ఈ-ఫైలింగ్ చేయడం, డిజిటలైజేషన్ ప్రక్రియ, ముందుగా పూరించిన రిటర్న్‌లలో ప్రతిబింబించే ఆర్థిక సమాచారాన్ని సేకరించడం, డేటా సేకరణ, అప్పీళ్ల దాఖలు, ఆదాయ పన్ను కార్యాలయం సందర్శించకుండా తీసుకున్న వివిధ పద్ధతుల గురించి తెలిపారు. స్టీల్‌ప్లాంట్ సీజీఎం (ఫైనాన్స్) వి.శాంతకుమార్ మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులు ఐటీ రిటర్న్‌లను సమర్పించడానికి ఆదాయ పన్ను అధికారులతో సంభాషించడానికి ఇది మంచి అవకాశమన్నారు. ఈ సందర్భంగా ఆదాయపు పన్ను శాఖ అధికారులు పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ప్రాజెక్ట్స్ సీజీఎం ఇన్‌చార్జి డాక్టర్ వి.ఆర్. బాపారావు తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇంటి శ్లాబ్


గుడివాడ అప్పన్నకాలనీలో కూలిన శ్లాబు

అక్కిరెడ్డిపాలెం: ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో ఒక నివాసం నాని, శ్లాబ్ కూలిపోయింది. కాలనీలోని ఓ ఇంట్లో రావినబోయిన అప్పారావు కుమారుడు నాగరాజు తన ఐదుగురు కుటుంబ సభ్యులతో నివాసం ఉంటున్నారు. కొద్ది రోజులుగా ఇంట్లో వారు బయటకు వెళ్లడంతో ఇల్లు ఖాళీగా ఉంది. శుక్రవారం వర్షం కారణంగా ఇల్లు నాని ముందున్న శ్లాబు ఒక్కసారిగా కూలిపోయింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడం, రోడ్డుపై కూడా ఎవరూ రాకపోకలు సాగించకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.

గిరి భక్తులకు ఇబ్బందులు రానీయొద్దు


జోరు వానలో గిరి ప్రదక్షిణ ఏర్పాట్లను అధికారులతో కలిసి పరిశీలిస్తున్న మేయర్ హరి వెంకటకుమారి

- అధికారులకు మేయర్ ఆదేశం
- గిరి ప్రదక్షిణ మార్గం పరిశీలన

డాబాగార్డెన్స్: సింహగిరి ప్రదక్షిణ మార్గంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి అధికారులను ఆదేశించారు. శుక్రవారం సింహాచలం తొలి పావంచా నుంచి అడవివరం, హనుమంతువాక, విశాలాక్షీనగర్, అప్పుఘర్, ఇసుకతోట, సీతమ్మధార, మాధవధార, గోపాలపట్నం మీదుగా గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులు వెళ్లే మార్గాన్ని జీవీఎంసీ అదనపు కమిషనర్ కేఎస్ విశ్వనాథన్, ఇతర ఉన్నతాధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ గిరి ప్రదక్షిణలో లక్షలాది మంది భక్తులు పాల్గొంటారని, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. పారిశుధ్యం, తాగునీరు, ఓఆర్ఎస్, ప్రథమ చికిత్స కేంద్రాలు, మరుగుదొడ్లు, విద్యుత్ దీపాలు వంటి ఏర్పాట్లపై మేయర్‌కు అదనపు కమిషనర్ విశ్వనాథన్ వివరించారు. పారిశుధ్య నిర్వహణకు అవసరమైన కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. తాత్కాలిక మరుగుదొడ్లు, లుంబినీ పార్కు సమీప బీచ్‌లో స్నానమాచరించే భక్తులు దుస్తులు మార్చుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఆయన చెప్పారు. బీచ్‌లో లైఫ్‌గార్డ్స్‌ను నియమించామన్నారు. స్వచ్ఛంద సంస్థలు, పలు సేవా సంఘాలకు స్టాళ్ల ఏర్పాటుకు స్థలాలు సూచించామని, ఆహార పదార్థాలు ప్లాస్టిక్‌లో కాకుండా ఆకులు, కాగితంతో తయారు చేసిన ప్లేట్లలో అందించాలని సూచించినట్టు ఆయన తెలిపారు. ప్రసాదం కౌంటర్ల వద్ద, నడక మార్గంలో ఎక్కడికక్కడ డస్ట్‌బిన్‌లు ఏర్పాటు చేశామని అదనపు కమిషనర్ మేయర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వై.శ్రీనివాసరావు, ప్రధాన ఇంజినీరు రవికృష్ణరాజు, ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

‘ఉక్కు’లో పరిస్థితులు ఆందోళనకరం


దీక్ష శిబిరంలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

అగనంపూడి: విశాఖ ఉక్కు కర్మాగారంలో నెలకొంటున్న పరిస్థితులు ఆందోళన కల్గిస్తున్నాయని ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, వి.శ్రీనివాసరావు, గంగవరం గోపీ అన్నారు. ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన రిలే దీక్షల్లో 1254వ రోజు, శుక్రవారం వారు మాట్లాడారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని ఏళ్ల నుంచి కోరుతున్నా ప్రభుత్వాలు పట్టనట్టు వ్యవహరిస్తుండడం బాధాకరమన్నారు. ఉత్పత్తి, ఉత్పాదకత, భద్రతా ప్రమాణాలు, ఆర్థిక పరిస్థితి, ముడిసరకు.. ఇలా అన్ని విధాలా ఉక్కును అష్ట దిగ్బంధనం చేసి ఊపిరాడకుండా చేయడం ద్వారా ‘ప్రైవేటీకరణ చేసేయండి’ అని కార్మికులు, స్థానికులే చెప్పే పరిస్థితికి తీసుకువెళ్తున్నారన్నారు. ప్రభుత్వాలు ఎన్ని కుట్రలు పన్నినా, ఎన్ని కుయుక్తులు వేసినా విశాఖ ఉక్కును కాపాడుకుంటామన్నారు. అవసరం వచ్చినప్పుడు రాష్ట్ర ప్రజలు తిరుగుబాటు చేస్తారని, అది ఎవరికీ మంచిది కాదన్నారు. ఎన్డీఏ భాగస్వామ్య పార్టీలైన టీడీపీ, జనసేనలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. దీక్షల్లో ఎఫ్ఎండీ, ఆర్ఎస్ అండ్ ఆర్ఎస్, సీఎంఈ, వీఎస్‌జీహెచ్, ప్లాంట్ డిజైన్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. దీక్షా శిబిరంలో పి.రామకృష్ణ రాజు, ఎం.ఎస్.రావు, పీజీకే రాజు, మధు, మోహన్, బి.వి.రమణ, గోపాల్, చిన్నయ్య, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

రక్షణ రంగ కార్మికుల సమస్యలపై నిరసన

సింధియా: భారతీయ మజ్దూర్ సంఘం(బీఎంఎస్) పిలుపు మేరకు ఇండియన్ నేవీ సివిలియన్ మజ్దూర్ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం నేవల్ డాక్ యార్డు గేటు ఎదుట నిరసన తెలిపారు. జోరు వానను సైతం లెక్క చేయకుండా రక్షణ రంగ విభాగాల్లో పని చేస్తున్న కార్మికులు ఆందోళనలో పాల్గొన్నారు. రక్షణరంగ కార్మికులు, ఉద్యోగులకు పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, 8వ వేతన సంఘాన్ని వెంటనే నియమించాలని, ఆదాయపన్ను పరిమితిని రూ.8 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. అలాగే పెన్షన్ కమ్యూటేషన్ భాగాన్ని 15 ఏళ్లకు బదులు 12 ఏళ్లకు మార్పు చేయడంతో పాటు రక్షణ మంత్రిత్వశాఖ పరిధిలోని ఖాళీలను భర్తీ చేయాలని నినాదాలు చేశారు. కారుణ్య నియామకాలకు సడలింపు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమానికి ఫెడరేషన్ అఖిల భారత కార్యదర్శి ఎస్. రాజేష్, గౌరవాధ్యక్షుడు పి.దేముడునాయుడు నాయకత్వం వహించారు.